# ‘ఛన్న రమణం’

కాశీభట్ల వేణుగోపాల్

**మనోకామనా వల్లరి వాడిపోయిందంతే...**
**ఎండిపోలేదు...**
**ఎప్పుడో ఏదో మాధుర్యపు చినుకు మనసును**
**తడపకపోతుందా...**
**వాడిన యీ తీగ జీవం పోసుకోదా...!**
**ఏమో!**
**తప్పొప్పులూ...**
**నీతీ నియమాలూ...**
**సంఘమూ సంస్కృతులూ...**

వీటిమధ్య పడి తన్నుకుంటూన్న ఆత్మసంయమనమనే పాదరస బిందువు జారి చిట్లిపోయే క్షణం రాదా?...

వస్తే గిస్తే...

తెలీని అపరాధభావన జీవితకాలం వేల్లాడ్తూంటుందా?

అసలు అపరాధభావన వుండాలా...

సుఖానికీ... ఆనందానికీ... కట్టడులకీ మధ్య దాగుడు మూతలు యుగాలుగా...

యంత అందమైన... అందంగా కనబడే అబద్ధాలాట!

దోబూచీ దొంగాట... దాగుడు మూతలు...

** ** **

ఛన్న రమణం

** ** **

నా ప్రమేయం లేకుండా నా శరీరాన్ని నా అంగీకారం లేకుండా సాంప్రదాయం, చట్టం ఆమోదించే కామక్రతువుకు సమిధగా చేసి... నా చుట్టూ నలుగురూ నవ్వుకున్నప్పటి క్షణం...

నాకు పరిచయ శూన్యంగా...

అతనో మగాడు...

కిటికీలు లేని ఉక్కపోత... జైలు...

ఊచల్లేని పంజరం...

నేను రెక్కలు కత్తరించబడ్డ చిలుకని...

రాలిన చిల్లర కామనల్ని గమనించుకుని కుంటుతూ వచ్చి నగ్నకాముని బొమ్మకార్డు లాగాలి... కట్ట నిండుగా అవేగా...

మోసం... మోసం... దొంగాట...

రెక్కలు కత్తరించేసిన నాకు... కుత్తుక కూడా వత్తేసారు...

అతను మగాడు... అతనూ ఓ మగాడు... మామూలు అతిమామూలు సాదాసీదా మగాడు... నా కస్సలు నచ్చని మగాడు... యిప్పుడు మగడట?!

నాకు పరిచిత పురుషగంధం నాన్నదే... నాకు తెల్సిన మగవాసన నాన్నే...

మాసిన దుడ్డు జందెం...

మెళ్లో ఓ నల్లతాడు... ఏ దేముడిదో కూడా తెలీదు...

నున్నగా గీకేసిన చంకలూ... అక్కడ పులిపిర్లూ... భుజమ్మీద తుండు...

కాళ్లకీ చేతులకీ అదే... తడీ ఆరీ ఆరక... కొద్దిగా గరుగ్గా... కొద్దిగా మెత్తగా... అదో రకమైన వాసనతో... అంతే నాకు తెల్సిన మగ వాసన నాన్నే...

తమ్ముడు రఘుగాడు కూడా మగపుటుక పుట్టాడు కానీ వాడు నాకు మగాడు కాదే...


“అక్కా! యిస్సీ.... కడగవే” వాడి లేత గొంతుక మగగొంతుక కాదు నాకు... అవును రగ్గాడు మగాడు కాదు నాకు...

మరిక్కడ? ఎవరు వీడు?

మగాడు...

అగరొత్తుల ఘాటు... చివ్వర్ల బూడిద వాలిపోయి పడిపోకుండా అంటుకుని వేల్లాడ్తో...

మల్లిపువ్వులు... దండలు దండలుగా ఎర్రగా కందిపోతూ సోలిపోయి ఆవులిస్తూన్నాయి... పరిమళం స్థాయి దాటి వెగటు వాసననొస్తోంది.



కథ

“రా” అన్నట్టు తలూపాడా మగాడు...

ఆ వేషంలో, బక్కపల్చగా... పక్కటెముకలు కనిపిస్తూ, కాస్త నల్లగా... సినెమాలో కమేడియన్‌లాగా వున్నాడనిపించింది...

నేను ఓ యించి కూడా కదల్లేదు...

కొత్త రవికె చంకల్లో గుచ్చుకుంటోంది...

బాడీ బిగుతుకు గుండెలు బిగపట్టినట్టుగా...

సిగ్గూ చిముడూ తెలీడం లేదు...

వాడు మిడిగుడ్లతో చూస్తూ ‘రా’ అన్నట్టు మళ్లీ తలూపాడు...

వీడి పేరేమిటో కూడా  పూర్తిగా తెలీదు... వీడి దగ్గర బట్టలన్నీ



ఊడదీసుకోవాలా? ఛీc...

అసలు అమ్మ తలంటుతానంటేనే బాత్రూంలోకి రానీయనే ఎవ్వడో ముక్కూ మొహం తెలీని మగాడిముందు దిగంబరం కావాలా... ఛీc... ఛీc... ఛీc...

వాడివేపు చిరాగ్గా చూసా...

మళ్లీ 'రా' అన్నట్టు తలూపాడు...

పక్క తలుపుల బైటినించీ ఏవేవో శబ్దాలు... గవాక్షంనించీ గుండిగలూ... పాత్రలూ... చిన్న చిన్న కేకలూ... చిత్రాన్నపు వాసన ఇంగువతో కూడుకుని... బేపనబోయనాలు కదా...

ఇక్కడ లోపల అగరొత్తులూ... అలసిపోయిన మల్లిదండలూ... మూలకి బియ్యపుమూటలూ... ముక్కవాసనా... చెమటా... కొత్తబట్టలవాసనా...

"రా" యీ మాటు కాస్తా పీలగా పిలిచాడు...

చిన్నగా కదిలా... కాళ్లు తిమ్మిర్లెక్కుతున్నాయి...

సినెమాల్లోలా నా చేతిలో పాలగ్లాసేం లేదు...

అరచేయి చూసుకున్నా... మధ్య గుండ్రంగా పెట్టిన గోరింట సగం ఎర్ర చెంద్రుడిలా పండింది...

"దాని చేతులకి గోరింటెందుకే పిచ్చిముండల్లారా... ఉదయాన్నే పూచిన దాసిన పువ్వుల్లా వుంటాయి దానరచేతులు..." నానమ్మ

"రా! సిగ్గా?" కొద్దిగా గొంతు గరగరతో బెరుగ్గా పిలిచాడు మళ్లీ...

ఇంకో రెండడుగులు వేసా... కూచోవాలనిపిస్తోంది... కాళ్లు పీకుతున్నాయి...

ఆగి మళ్లీ నిశితంగా చూసా...

**"దానికిష్టం లేకుండా దాన్నెవరు తాకినా అది నానా యాగీ చేస్తుందీ... దాన్నలా వదిలీండి... వరే వెంకూ దాన్నొదులూ... దాన్నెవ్వరూ తాక్కండి..."**

**నానమ్మ... గతంలోంచీ...**

**చెయ్యి విసురుగా లాక్కుని పరిగెత్తి నాలుగడుగులేసి బియ్యపు మూటలు నానుకుని నుంచున్నా...**

లేని అద్దంలో నా బొమ్మ నిన్నటిది... మొన్నటిది...యింతకుముందుటిది...ఇరవయ్యేళ్ల నా బొమ్మ..

నేను చూసుకున్న బొమ్మ నా బొమ్మ... కనీకనిపించక కనిపించి...

అరటి సుడిలో నోరు తెరుచుకుని ఉదయపుటెండలో లేతగా మెరిసే చిగురుటాకులాంటి నా బొమ్మ...

"అబ్బ యంత నున్నగా వుంటావే!" బెంచిమేటు రూతు...

"దీనందం... ముఖ్యం దీని గుండ్రటికళ్లు నాకుంటే ఈ మగెదవల్ని నా కాళ్ళెంబట కుక్కల్లా తిప్పించుకునేదాన్ని కాదూ...!" రాజేశ్వరి.

మళ్లీ మంచంవేపు మళ్లాయి నా కళ్లు...

ఆ వ్యక్తి కళ్లల్లో లీలగా ఏదో జంకు, భయం, ఆందోళన కలగలసి పల్చగా కనబడ్తోన్నాయి...లేదూ కనిపిస్తూన్నట్టు నాకనిపిస్తోందా? ఏమో..

'రా' అన్నట్టు తలూపి... తడబడుతూ లేచాడతను...

నేనో అడుగు వెనక్కి వేసా అప్రయత్నంగా... అప్రయత్నంగానేనా?

ఆ వ్యక్తి చిన్నగా దగ్గరికొచ్చాడు...

నా గుండెలు పావురాయి రెక్కల్లా టపటపా కొట్టుకుంటున్నాయి...

యింకో అడుగు వెనక్కి...

అలవాటులేని చీర అంచు కాలిమడమల కిందికొచ్చింది... తడబడ్డా...

అప్రయత్నంగా నిలదొక్కుకోడానికి ఎడమచేయి పైకి లేచింది... చెరుగు తొలగి ఎడంరొమ్ము... గబుక్కున కప్పుకున్నా...

పల్చగా నల్లగా వున్న అతని చేయి నా చేతిని పట్టుకుంది....

"ఆc" ఓ నిశ్శబ్దపు కేక నా నోట్లోంచీ...

"దానికిష్టం లేకుండా దాన్నెవరు తాకినా అది నానా యాగీ చేస్తుందీ... దాన్నలా వదిలీండి... వరే వెంకూ దాన్నొదులూ... దాన్నెవ్వరూ తాక్కండి..." నానమ్మ... గతంలోంచీ...

చెయ్యి విసురుగా లాక్కుని పరిగెత్తి నాలుగడుగులేసి బియ్యపు మూటలు నానుకుని నుంచున్నా...

వేణుగోపాలస్వామి ఆలయం ముందుటి కుష్టాళ్లని తప్పించుకుంటూ పరిగెత్తడం గుర్తొచ్చింది... అబ్బో యంతమంది కుష్టాళ్లో!

మరి వీడో?!

వీడెవడసలూ... నా చెయ్యి పట్టుకోడానికి... మగడా? మగడైనాసరే నా యిష్టం లేకుండా...?

వాడు పట్టుకున్న నా పట్టు... పసుప్పచ్చటి పట్టు... పల్చటి నా చేతిని చూసుకున్నా... తుడుచుకున్నా...

"హీ హిహీ... సిగ్గా?" మళ్లీ దగ్గరగా వచ్చాడు...

అతన్దగ్గర తెలీని వాసన...

చెమటా... కొత్త బట్టలూ... ఆరిపోతోన్న అగరొత్తులూ... సోలిపోయిన మల్లిదండలూ... వాటి కమురువాసనా... ఉక్కా...

తల భుజానికానించుకున్నా...

నా తల్లో మల్లిదండ కూడా వాడిపోతోంది.

నేను కూడా...

తెల్లార్జామున నిద్దట్లో లేపి కూచోబెట్టారు...

పెళ్లిట... యవత్తి పీక్కుచచ్చిందీ పెళ్లికావాలనీ... అప్పుడెప్పుడో యింటర్మీడియట్లో యర్రగా బొద్దుగా వున్నాడని కుర్ర యింగ్లీషు లెక్చరర్మీద మనసుపడ్డానే తప్పించీ...

** ** **

"అమ్మలూ! మనింటి విషయాలు నీకు తెలుసు... నా స్థితిగతులు కూడా నీకు తెలుసు ప్రత్యేకం చెప్పాల్సినవసరం లేదు... మన గడప తొక్కి వాళ్లంతట వాళ్లుగా వచ్చి నిన్ను కావాలనడిగారు... కుర్రాడు ప్రయివేటు కంపెనీలో అయినా బాగానే సంపాదిస్తున్నాడు... ఈ రోజుల కుర్రాళ్లకి మల్లే ఏ దురభ్యాసాలూ లేవు... పైగా నిన్నిష్ట పడ్డాడు... వాళ్లదీ పెద్ద కుటుంబం... నీకా యిరవై వచ్చాయి... ఎవ్వడో దానయ్యకి బదులుగా ఉన్న కుటుంబంలో యిచ్చానన్న తృప్తి నాకుంటుంది... కాస్త ఛాయ తక్కువైనా మంచి కళగా వున్నాడు కుర్రాడు..."

గోడకానుకుని గొంతుక్కూచున్న నా ముందు బాసింపట్టేసుకుని నాన్న దీనంగా...

"నే... అదికాదూ... నానా! ఎమ్మెస్సీ చేద్దామనీ... యిక రెండేళ్లే నానా!

అందుకనీ యిప్పుడొద్దు నాన్నా!" (వాడు నాకస్సలు నచ్చులే బాలేడు నాకందుకనీ వద్దూ)

"ఇక నా వల్ల కాత్తల్లీ... ఇదుగో దీనిక్కాస్తా చెప్పూ..." నాన్న మామూలు తెలుగు సినెమా మధ్యతరగతి తండ్రిలా ఓ పేద్ద నిట్టూర్పొదిలి...

అమ్మా... నానమ్మా అటొకరూ ఇటొకరూ జాయింటుగా మేళం... కన్నీళ్లూ

రేవతి గురించిన బెదిరింపు మాటలూ... అందుకూ...

ఇదిగో యిలా యీ చీకటికొట్లో... ముక్కవాసనల్లో బియ్యపు సంచీకానుకునీ... చెయ్యి తుడుచుకుంటూ... వాడు ముట్టుకున్నాడని...

పేరు కూడా సమంగా తెలీని యితని ముందు

ఛీః

సడెన్నా బాత్రూంకెళ్లాలన్పించింది...

గదిలోకి నెట్టబడ్డ తర్వాత మొదటిసారిగా సిగ్గు... చచ్చే సిగ్గుగా అన్పించింది.

వెళ్లాలంటే పక్కతలుపు తెరుచుకెళ్లాలి...బయట గొళ్లెం పెట్టుంటారా?

అయినా ముందు యితన్ని దాటి వెళ్లాలిగా...

అతని చెయ్యి టపీమని ఎడం భుజమ్మీద పడింది... అతని చెయ్యి వణుకుతోంది...

భుజం విసురుగా లాక్కున్నా...

నా ఎడం రొమ్మును తాకుతూ అతని చెయ్యి జారింది...

నన్నెవరో హత్య చేసినట్టనిపించింది...

రెండు చేతుల్తోటీ అతన్ని ఓ తోపు తోసాను...

నా చేతులకి అంత శక్తి వుంటుందని నాకు తెలీదు...

పరిగెత్తి తలుపు చేరుకుని దబదబా... దబదబా బాధా... బాదుతూ వెనక్కి తిరిగి చూసా...

కిందపడి లేచినతని కళ్లలో విస్మయం... కోపం... పరాజయ భావం... యింకా ఏంటేంటో...

తలుపులు దబదబా బాదా మళ్లీ... బాత్రూం యిటు యీ తలుప్పక్కన్నే...

అప్పుడు గమనించా తలుపు లోపలివేపునే గొళ్లెం యేసుంది... గొళ్లెం మకిలి పట్టివుంది... లాగా... వూహూ... రావట్లే...

సంశయంగా వెనక్కి తిరిగి అతన్ని చూసా...

ఓ విధమైన నిస్సహాయతా విస్మయం కలసిన చూపుల్తో నన్నే చూస్తున్నాడు.

గొళ్లెం కీచు కీచుమని గొంతు చించుకుంటూ వచ్చేసింది...

తెరుచుకున్న తలుపుల్లోంచీ... తల బైటికిపెట్టి బెరుగ్గా చూసా...

బాత్రూం పక్కన్నే వున్నా గదికి కాస్తా యెడంగా వుంది... వసారా కనిపిస్తోంది

నిండుగా అందరూ వున్నారు... వాళ్లందరూ తలలెత్తి చూస్తూండగా...

రెక్కలు కత్తరించిన చిలుక పరుగులాంటి పరుగులతో

నవ్వుల్నీ... గుసగుసల్నీ...

'హా'శ్చర్యాల్నీ... 'హవ్వ'ల్నీ...

'చో'ద్యా'ల్నీ...

విప్పారిన కళ్లనీ... తెరుచుకున్న నోళ్లనీ...

నా వెనగ్గా పరిగెత్తుకొస్తోన్న అమ్మనీ...

"దాన్నేం అనకండి నే చెబుతా" అంటూ ఆయాసపడ్తోన్న నానమ్మనీ...

వేటినీ... ఎవ్వర్నీ పట్టించుకోక

చీర కుచ్చెళ్లు కాళ్లకడ్డం పడ్తోంటే...

పరుగు పరుగున బాత్రూంలో దూరి తలుపేసుకున్నా...

** ** **

నీళ్ల గుండిగ నానుకుని యెంతసేపలా వుండిపోయానో...!



**నాకు చిన్నప్పట్నించీ ఎందుకో తెలీదు చేమదుంపల పులుసంటే చచ్చే అసహ్యం... అస్సలు సయించదు... కారణం తెలీదు... ఈ రోజుకీ ఇప్పటికీ కూడా... ఇతనంటే కూడానూ...**

బాత్రూం తలుపులు దడదడలాడ్తోన్నాయి...

"తలుపు తెరవ్వే పాపిష్టిదానా!" అమ్మ

"అమ్మలూ తలుపు తెరూ నేనూ..." నానమ్మ.

తప్పదు బాత్రూంలోనే జీవితాన్ని గడిపేయలేను కదా... ఆత్మహత్య చేసుకునే ధైర్యంలేదు... అసలు నిన్నటికి నిన్ననే ఇంట్లోంచి... ఊహూః...

ఎక్కడికనీ... ఎవ్వరున్నారనీ...ఛీః

"తలుపు తెరూ!" నాన్న గొంతు... వణుకుతోంది...

కాళ్లు తడబడ్తూ... తెరిచా...

తెరిచింది బాత్రూం తలుపేనా?

"ఏవిటే యిదీ?" అమ్మ.

"భయమేసిందా అమ్మలూ?" నానమ్మ.

"నా... నాకు వద్దు... నాకిష్టంలేదు... నే వెళ్ల..."

"చంపుతా జష్టముండా!" శబ్దం బయటికి రాకుండా పళ్లు గిటక్కర్చి నాన్న...

"తప్పే యిదీ... యిప్పటికే అందరూ మమ్మల్ని కాంతేసేట్టు చూస్తున్నారు పదా" అమ్మ

"ప్రతి ఆడపిల్లకీ యిది తప్పదురా అమ్మలూ పదా!" నానమ్మ.

మొండిగా గుండిగ అంచు పట్టుకు నుంచున్నా...

నాన్న విసవిసా నీళ్లకాగు మూలకెళ్లి గూట్లో కిరోసీన్ డబ్బా తీసుకొచ్చి నా ముందు నుంచుని... వణుకుతోన్న పెదాల్తో నీళ్లు నిండిన కళ్లతో నన్ను చూసాడు... నాన్న నోట్లోంచీ మాట రాకున్నా... నాన్న చెప్పాలనుకున్నది నాకు అర్థమవుతోంది...

నానమ్మ నాన్న చేతిలో కిరోసీన్ డబ్బా లాక్కోడానికి తీవ్రంగా ప్రయత్నించసాగింది.

అమ్మ మౌనంగా బాత్రూం నేలమీద చతికిలబడి తల రెండు చేతుల్తో పట్టుకు కూచుండిపోయింది... ఓ నిముషం తర్వాత తలెత్తి రెండు చేతులూ జోడించి నాకు నమస్కారం చేసి ధబీమని నా కాళ్లమీద పడింది...

'అ...మ్మా' నిశ్శబ్దంగా నా నోట్లోంచి కేక...

తెలుసు నా హత్య జరిగిపోయింది... కదిలా నెమ్మదిగా...

నాన్న చేతిలో కిరోసిన్ డబ్బా నానమ్మ చేతిలోకొచ్చేసింది.

** ** **

జరిగిందేమిటో యిక చెప్పాల్సినవసరం లేదు...

ఓ తండ్రి కూతురనే భారాన్ని దించుకుని నిట్టూర్చాడు...

ఓ తల్లి నిర్వేదపు కన్నీళ్లూ చిర్నవ్వూ కలగలిసాయి.

ఓ కుటుంబపు పరువు భద్రంగా వుండిపోయింది...

ఓ మగాడు యిష్టంలేని ఆడదానికి మగడయ్యాడు...

కలలకు ఉరేసుకున్న ఓ ఆడది గృహిణి అయ్యింది...

అంతా సజావుగా మిగిలిపోయింది...

ఒక్క...? అవును ఒక్క 'నేను' తప్ప

** ** **

పదిహేనేళ్లు గడచిపోయాయి...

పెళ్లిళ్లూ... పేరంటాలూ... పండగలూ... తద్దినాలూ... గెట్టుగెదర్లూ...

ఇద్దరు పిల్లలూ... భద్రసమాజంలో ఓ చిన్న 'గోప్ప' కుటుంబం...

నాకు చిన్నప్పట్నించీ ఎందుకో తెలీదు చేమదుంపల పులుసంటే చచ్చే అసహ్యం... అస్సలు సయించదు... కారణం తెలీదు... ఈ రోజుకీ ఇప్పటికీ కూడా... ఇతనంటే కూడానూ...

అంతే...! కానీ?!

సుఖానికీ, ఆనందానికీ... కట్టడులకీ మధ్య దాగుడుమూతలు యుగాలుగా...

అందమైన... అందంగా కనబడే అబద్ధాల ఆట...

దాగుడుమూతలు... పేరు కూడా యంత అందంగా వుందో!

'ఛన్న రమణం'.